# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 158 | గురువారం | 21 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో

## కాంగ్రెస్ ఎంపీలు క్షమాపణ చెప్పాలి

బీజేపీ ఆధ్వర్యంలో కాశిబుగ్గ సెంటర్‌లో నిరసన



6లో..

## విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ

- శ్వేతపత్రం విడుదల చేసిన భట్టి
- అప్పులు చేసి ఆస్తులు పెంచామన్న జగదీశ్ రెడ్డి
- గత ప్రభుత్వం తీరుపై మండిపడ్డ అధికార పక్షం
- ప్లాంటుల పేరుతో దోపిడీ చేశారన్న కోమటిరెడ్డి



# మళ్లీ కరోనా..?



వివరాలు 2లో..

- కోరలు చాస్తున్న కొవిడ్ కొత్త వెరియంట్
- చలికాలం కావడంతో విస్తరించే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు
- ఎంజీఎంలో ప్రత్యేక వార్డు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- జేఎన్-1 ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని అంతా సంతోషిస్తున్న వేళ ఇప్పుడు కొత్త వేరియంట్ రూపంలో మళ్లీ గుబులు రేపుతోంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న కొవిడ్ వైరస్‌తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత రెండేళ్లు ప్రశాంతంగా సాగిన జన జీవనం కొత్త వైరస్‌తో అస్తవ్యస్తంగా మారనుంది. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. తగు చర్యలు తీసుకోవాలని కోరింది. రాష్ట్రాలకు సాయం అందించేందుకు కేంద్రం సంసిద్ధంగా ఉందని ప్రకటించింది. కాగా గత 24 గంటల్లో దేశంలో రికార్డు స్థాయిలో 614 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోనూ కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం నాలుగు కేసులు నమోదుకాగా, బుధవారం కొత్తగా ఆరు కరోనా కేసులు వెలుగు చూశాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వరంగల్‌లోని ఎంజీఎంలో కూడా ప్రత్యేక కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8 లో..

## చెత్త సేకరణలో చిత్తశుద్ధి చూపాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- పారిశుధ్య, మలేరియా అధికారులతో సమన్వయ సమావేశం



8 లో..

## ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయం

- మేయర్ గుండు సుధారాణి | కేక్ కట్ చేసిన మేయర్, కమిషనర్
- జేపీసీ ఆధ్వర్యంలో ప్రీ-క్రిస్మస్ వేడుకలు

# మళ్లీ కరోనా..!



**కోరలు చాస్తున్న కొవిడ్ కొత్త వేరియంట్**

**చలికాలం కావడంతో విస్తరించే అవకాశం**

**అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు**

**ఎంజీఎంలో ప్రత్యేక వార్డు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం**

**జేఎన్-1ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మరోమారు కోవిడ్ కలకలం రేపుతోంది. పెరుగుతున్న కేసులతో భయం వెంటాడుతోంది. కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 విషయంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు,హెచ్చరికలు చేసింది. కోవిడ్ లక్షణాలు కనిపిస్తే ఆర్‌టీపీసీఆర్ టెస్టులు చేయాలని ఆదేశించింది. పాజిటివ్ శాంపిళ్లను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని పేర్కొంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సవిరీక్షించాలని సూచించింది. భారత్ సహా 38 దేశాల్లో జేఎన్-1 వేరియంట్ కలకలం రేపుతోందని కేంద్రం పేర్కొంది. అధికారులు అప్రమత్తంగా ఉంటూ కొత్త కేసులపై నిఘా ఉంచాలని తెలిపింది. కేరళ లాంటి రాష్ట్రాల్లో కరోనా కేసులు అధికంగా నమోదు కావడంతో అప్రమత్తంగా ఉండాలంటూ సూచించింది. ఫెస్టివల్ సీజన్ తోపాటు చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వైరస్ విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## జేఎన్-1 కలవరం..

కరోనా మహమ్మారి మళ్లీ వణికిస్తోంది. తెలంగాణలో కొత్త వేరియెంట్ గుబులు పుట్టిస్తోంది. చలికాలం కావడంతో ఫ్లూ కేసులు పెరిగిపోతున్నాయి. దీంతో చాలామంది కరోనా పరీక్షలకు వెళ్తున్నారు. ఈ నెల 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 402 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 14 కేసులు వెలుగు చూశాయి. ఇందులో 13 కేసులు హైదరాబాద్‌లో రాగా, ఒకటి కరీనంగర్‌లో నమోద్కెంది. వారందరూ ఇండ్లలోనే చికిత్స పొందుతున్నారు. అయితే వారికి సోకిన వేరియెంట్‌ను గుర్తించే పనిలో అధికారులున్నారు. గత 24 గంటల్లో దేశంలో రికార్డు స్థాయిలో 614 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే 21 తర్వాత ఇంత అధిక స్థాయిలో కరోనా కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 2,311కు చేరినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది.

## మంత్రి సమీక్ష..

జేఎన్-1 వేరియంట్‌తో కొవిడ్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్యశాఖ అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బందికి మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. వరుసగా ఆయన వైద్య శాఖాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షలు, చికిత్స పరికరాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎకడ్కెనా కొరత ఉంటే టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ నుంచి సమకూర్చుకోవాలన్నారు. మాక్ డ్రిల్‌ను వెంటనే పూర్తిచేయాలని, దవాఖానల సన్నద్ధతకు సంబంధించిన వివరాలను కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఇన్‌ఫ్లుయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. దవాఖానలు, జిల్లా స్థాయిలో విభాగాధిపతులు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విధిగా నమూనాలను ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ)కు పంపాలని కోరారు. బాధితుల్లో ఎవరికీ తీవ్రమైన లక్షణాలు లేవని, వారంతా హోమ్ ఐసోలేషన్‌లో కోలుకొంటున్నారని చెప్పారు. బుధవారం 319 కొవిడ్ పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి పాజిటివ్‌గా తేలిందన్నారు.

## పెరుగుతున్న తీవ్రత..

వైరస్ తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఇప్పుడిప్పుడే పెరుగుతున్న నేపథ్యంలో ఈ వైరస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలపై ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. వైరస్ సోకినప్పటికీ బయటికి పెద్దగా లక్షణాలు కనిపించకపోవడంతో పలువురు నిర్లక్ష్యం చేస్తున్నారని దీంతో ఈ వ్యాధి త్వరగా మరింత మందికి సోకే అవకాశం ఉందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

## నో మాస్క్..నో ఎంట్రీ..



కేసులు పెరుగుతుండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలు తప్పకుండా మాస్క్ ధరించాలని ఆదేశాలు జారీచేసింది. మాస్క్ ధరించకపోతే ఫైన్ విధిస్తామని హెచ్చరించింది. కోవిడ్ బాధితులకోసం ఇప్పటికే ఎంజీఎంలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసిన ఆసుపత్రి అధికారులు నో మాస్క్..నో ఎంట్రీ అంటూ గట్టిగానే చెబుతున్నారు. మాస్క్ లేనిదే ఎవరినీ ఎంజీఎంలోకి ఎంట్రీ కానివ్వడం లేదు. మాస్క్ ధరించాలంటూ అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారు. కాగా భూపాలపల్లి జిల్లాకు చెందిన ఒక వ్యక్తికి కొత్త వైరస్ సోకినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఎంజీఎం అధికారులు మాత్రం స్పష్టమైన సమాచారం ఇవ్వడంలేదు.



## ప్రత్యేక వార్డులు సిద్ధం..

కొత్త వేరియంట్ అంత ప్రమాదకారి కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. శరవేగంగా వ్యాపించే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రయాణాలను తగ్గించుకోవాలని, ఎక్కువగా ఇంటికే పరిమితం కావాలని, జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. ఇందుకు గాను అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో యాభై పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. వెంటిలేటర్లు, ఆక్సిజన్ బెడ్లతో పాటు సాధారణ బెడ్లను అందుబాటులో ఉంచారు. అయితే కరోనాతో ఇప్పటి వరకు ఎవరూ మృతి చెందలేదని ప్రభుత్వం చెబుతున్నా సోషల్ మీడియాలో మాత్రం ఒకు మృతి చెందినట్లు వస్తున్న వార్తలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లక్షణాలు ఉన్నవారికి వెంటనే కొవిడ్ పరీక్షలు నిర్వహించాలంటూ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## వ్యాధి లక్షణాలు :



జలుబు, జ్వరం, దగ్గు, తలనొప్పి, అలసటగా ఉండటం వ్యాధి లక్షణాలుగా ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ లక్షణాలతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు ముఖానికి చేతి రుమాలు లేదా నాప్కిన్ అడ్డుపెట్టుకోవాలని, బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని, కుటుంబ సభ్యులతో ఎక్కువగా కలిసి ఉండకుండా చాలా దూరం పాటించాలని, వ్యాధి తీవ్రత పెరుగుతుంటే వెంటనే దగ్గరలో ఉన్న ఐసోలేషన్ కేంద్రానికి వెళ్ళాలని సూచిస్తోంది.

## తీసుకోవలసిన జాగ్రత్తలు ..

ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి ఏ వ్యాధి త్వరితగతిన వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు దూరం పాటించడం శ్రేయస్కరం అంటున్నారు. వైరస్ సంక్రమించిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతిరుమాలు లేదా నాప్కిన్ అడ్డుపెట్టుకోవాలని సూచిస్తోంది. వైరస్ ఉన్న వ్యక్తి నోటి నుంచి వచ్చిన తుంపరలు ఏదైనా వస్తువుపై పడినపుడు ఆ వస్తువుని ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తాకడం ద్వారా ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది. ఏదైనా వస్తువుని తాకిన చేతులతో ముఖాన్ని, నోటిని, ముక్కుని తాకడం చేయకూడదని సూచిస్తున్నారు.

## ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు తీసుకోవలసిన జాగ్రత్తలు..

చేతులను వీలైనన్ని సార్లు సబ్బుతో లేదా శానిటైజర్ లిక్విడ్ తో కడుక్కోవాలని, మొహాన్ని, నోటిని, ముక్కుని చేతులతో తాకడం బాగా తగ్గించుకోవాలని, జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలని, షేక్ హ్యాండ్ ఇవ్వడం, స్పర్శతో కూడిన ఎటువంటి పలకరింపులైన తగ్గించాలని, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# కాంగ్రెస్ ఎంపీలు క్షమాపణ చెప్పాలి

**బీజేపీ ఆధ్వర్యంలో కాశిబుగ్గ సెంటర్‌లో నిరసన**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పార్లమెంట్ సమావేశం తర్వాత భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్కర్ పై తృణముల్ కాంగ్రెస్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన అవహేళన ప్రదర్శనను ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం ఆధ్వర్యంలో బుధవారం కాశిబుగ్గ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంటనే రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ నాయకులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్ బాబు, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కనుకుంట్ల రంజిత్, బాకం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## హెల్మెట్లు ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

### రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారులు అతినిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాటి నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. గురువారం రఘునాథపల్లి పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి నేపథ్యంలో కేంద్రంలో సీఐ కార్యాలయం వద్ద స్థానిక విలేకరులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువతీ, యువకులు రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా గురవడం బాధాకరమైన విషయమని, అతివేగం అజాగ్రత్త వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. యువత కచ్చితంగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా వెళుతూ హెల్మెట్లను ధరించాలని ఆయన సూచించారు. లింగాల గణపురం రఘునాథపల్లి చిల్పూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కడ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. ప్రతిరోజు హైవేపై పోలీసులు వాహనాలను తనిఖీ చేయడంతో పాటు లైసెన్స్ లేని వ్యక్తులను గుర్తించి జైలుకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని నియమ నిబంధనల ప్రకారం ప్రయాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ పెల్లి సబ్ ఇన్ స్పెక్టర్ రఘుపతి, సిబ్బంది, మండల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర నూతన అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ లోని వారి నివాసంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు పల్లపు కుమారస్వామి, ఆత్మకూరు కాంగ్రెస్ మాజీ ఉపసర్పంచ్ పోలు సతీష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆరూరి మోహన్ రావు, పల్లపు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## మత్తు పదార్థాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, మడికొండ :** విద్యార్థులు, యువత మత్తు పదార్థాల నిషేధంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐలు రాజబాబు, దివ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. మడికొండ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ స్కూల్, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ వందమంది విద్యార్థులతో మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం యువతకు, విద్యార్థులకు మంచిది కాదని, ఒకవేళ ఎవరైనా తెలి యకుండా వాడితే అటువంటి వారు ఇకనైనా వాటికి స్వస్తి పలకాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం పూర్తిగా చెడిపోవడమే కాకుండా బంధువులకు, కుటుంబ సభ్యులకు దూరమవుతారని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను సేవించినట్టు కనబడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బాయ్ స్కూల్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# వికసిత భారత్ యాత్రను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హులైన వారిని సంక్షేమ పథకాలలో చేర్పించే విధంగా వికసిత భారత్ యాత్ర ప్రారంభం కానుందని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. తొర్రూరులో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మరోసారి విజయం సాధించడం ఖాయమని తెలిపారు. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని పీఠంపై కూర్చోవడం ఖాయమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అహర్నిశలు దేశం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని చెబుతున్న రేవంత్ రెడ్డి, నియంతృత్వ పాలన, ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేసిన నిరంకుశ పాలనను దేశ ప్రజలు మరిచిపోలేదని, అట్లాంటి నిరంకుశ పాలనను తెస్తామంటే ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తారని, కేసీఆర్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుందని, తెలంగాణలో ప్రజా పాలనను కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా పాలన కొనసాగితే పోరుబాట తప్పదని హెచ్చరించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అస్తవ్యస్తంగా ఉన్న పాలనను గాడిలో పెట్టాలని సూచించారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకొని ప్రజల పక్షాన నిలబడి బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీజేపీ పోరాటం చేస్తుందని, ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకం ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, జిల్లా అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా మహబాద్ పార్లమెంటు ఇంచార్జి అలిసేరి రవిబాబు, రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్, జిల్లా, మండల నాయకులు పైండ్ల రాజేష్, శేఖర్, నడిగడ్డ ఉపేందర్, కొండా యాకన్న, విజయ్ కుమార్, వినయ్ శర్మ, కాగు నవీన్, సంతోష్, చలపతి రాజ్, సందీప్, నూకల నవీన్, జగదీష్, శివ, బషీర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లోని ముకుంద కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటానికి మేయర్ గుండు సుధారాణి కమిషనర్ షేక్ రిజ్వానా బాషా దృష్టికి తీసుకువచ్చి తాను శాయశక్తుల కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కాలనీలో నివసిస్తున్న ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం ముకుందా కాలనీ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముకుందా కాలనీలోని ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు మిషన్ భగీరథ పైప్లైన్లు లేవని 60ఫీట్ల రహదారి మూసివేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని మాట వాస్తవమేనని త్వరలోనే అధికారులతో పర్యటించి ముకుంద కాలనీ ప్రజలకు మంచినీరు తాగడానికి పైప్ లైన్ల నిర్మాణం చేపడుతామని, అలాగే 60ఫీట్ల రహదారి గుండా ప్రజలు వెళ్లడానికి చొరవ చూపుతానని కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కాలనీవాసులు ఆంగోతు వీరన్న నాయక్, వాంకుడోత్ విజయ్, ఉల్లి నాగరాజు, ముత్తినేని నవీన్, సుభాష్, తిరుపతి, శ్రవణ్, వాంకుడోత్ రాహుల్, ఉల్లి కవిత, రజిత, డాక్టర్ కృష్ణవేణి, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

## గంపా సతీష్‌కు డాక్టరేట్

### ప్రదానం చేసిన తెలుగు విశ్వవిద్యాలయం



**వరంగల్ వాయిస్, వరంగల్:** గంపా సతీష్ 'వరంగల్లు జిల్లా మల్లన్న జాతరలు – అధ్యయనం' అనే పరిశోధనాంశంపై పీఠాధిపతి డా.గడ్డం వెంకన్న పర్యవేక్షణలో తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించగా,విశ్వవిద్యా లయం కంట్రోలర్ నేడు సతీష్ కు డాక్టరేట్ ప్రకటించింది. గంపా సతీష్ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో టెక్నికల్ అసిస్టెంట్ గా గత 23సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. తన సిద్ధాంత గ్రంథంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే పద్నాలుగు మల్లన్న జాతరలను గుర్తించి ఆయా జాతరలకు సంబంధించిన చారిత్రక, మౌఖికాంశాలను మొక్కుబడులను, భక్తుల విశ్వాసాలను, ఒగ్గు పూజారుల ఔన్నత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, జాతర సంస్కృతిని భవిష్యత్తు తరాలకు నిక్షిప్తం చేసినట్లు పేర్కొన్నాడు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పీఠాధిపతి డా.గడ్డం వెంకన్న అభినందించారు. అలాగే పింగిళి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రజిత, జానపద గిరిజన విజ్ఞానపీఠంలోని అధ్యాపక సిబ్బంది ఆచార్య భూక్య బాబురావు, డా.బాసని సురేష్, డా.శ్రీమంతుల దామోదర్, డా.చూరపల్లి రవికుమార్, అబ్బుగోపాల్ రెడ్డి, బోధ నేతర సిబ్బంది సతీష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# యువత అన్ని రంగాల్లో రాణించాలి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత అన్ని రంగాల్లో ముందుకు రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తెలిపారు. హనుమకొండ జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా యువజన సంక్షేమ, క్రీడల శాఖ అధికారి గుగులోత్ అశోక్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్ హాజరై మాట్లాడుతూ భారతదేశం అత్యధిక యువ జనాభా కలిగిన దేశం అని అన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో యువత పాత్ర అమోఘమైందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో యువతీ యువకులు చేసిన పోరాట ఫలితమే నేడు మనం స్వరాష్ట్రంలో జీవనాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ముఖ్యంగా మన తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతలో ఉన్న శక్తిని వెలికి తీయడానికి ఇలాంటి యువజన ఉత్సవాలు చాలా ఉపయోగపడతాయన్నారు. మరొక ప్రత్యేక అతిథిగా హాజరైన జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశు రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఒక నూతన యువజన పాలసీని మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ, పట్టణ యువతీ యువకులను సాంస్కృతిక రంగాల్లో, అలాగే క్రీడ రంగాల్లో రాణించడానికి ప్రత్యేకమైనటువంటి పాలసీని తీసుకువచ్చి వారిని అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన అవార్డు గ్రహీత గంగోజుల నరేష్, యువజన సంక్షేమ శాఖ సిబ్బంది నయీం, సుజన్, ఏవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోడిమాల శ్రీనివాస్ రావు, సిబ్బంది వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువతీ యువకులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

# సమాజ హితమే సదాశయ ఫౌండేషన్ లక్ష్యం

## సాయి సేవా ట్రస్ట్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక స్వామి వివేకానందనగర్ (పూరి గుట్ట)లో గల సాయి సేవా ట్రస్ట్ లో ఉన్న వృద్దులకు, విద్యార్థులకు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ వాసన్ కంటి ఆసుపత్రి, హనుమకొండ వారి సహకారంతో 97మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ నిర్వాహకులు రంగయ్య, లక్ష్మి కాంతారావు, లక్ష్మిప్రియ మాట్లాడుతూ వృద్ధులు ఆసుపత్రికి పోకుండా ఆశ్రమానికే వచ్చి కంటి పరీక్షలు నిర్వహించిన వాసన్ కంటి ఆసుపత్రి సిబ్బందికి, కార్యక్రమం




చేపట్టిన సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నేత్రాలను జీవించినంత కాలం కాపాడుకొని, తదనంతరం నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సేవా కార్యక్రమానికి అవకాశం కల్పించిన ట్రస్ట్ బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్య అతిథి కె.పురుషోత్తం(విశ్రాంత అటవీ శాఖాధికారి) మాట్లాడుతూ సాయి సేవా ట్రస్ట్ ద్వారా పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు, సదాశయ ఫౌడేషన్ ద్వారా అవయవ, శరీర దానాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలతో సమాజ హితానికి తోడ్పడుతున్న శ్రవణ్ కుమార్ బృందానికి, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించిన వాసన్ కంటి ఆసుపత్రి బృందానికి అభినందనలు తెలిపారు. ఈ ఉచిత పరీక్షా శిబిరంలో వాసన్ ఐ హాస్పిటల్ నుంచి అరుణ్, రాజన్, వినయ్, అనిత పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ వర్ధన్నపేట తాలూకా కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ వర్ధన్నపేట తాలూకా యూనిట్ ఎన్నికలు వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజల ఆకాంక్షలు అనుగుణంగా పనిచేసి అటు ప్రభుత్వానికి, ఇటు సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వర్ధన్నపేట తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా దేవేందర్, కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా విజేందర్, ఉపాధ్యక్షులుగా మత్యాస్ రెడ్డి, అమరావతి, చక్ర బహదూర్, శరత్, సంయుక్త కార్యదర్శిగా మహేందర్, సుమన్మిత్ర, అనిల్, లిఖిత, శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా హుస్సేన్, సాయిరాం కార్యవర్గ సభ్యులుగా సలావుద్దీన్, ఐలయ్య, లక్ష్మయ్య, సుమన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు గద్దల రాజు, సంయుక్త కార్యదర్శులు పోలసాని దుర్గారావు, శంకేసి రాజేష్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులు రఘు, కార్యదర్శి సదానందం, రామారావు, సురేష్, జ్యోతి లతా, స్వర్ణ, స్వప్న మిగతా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రేపు కాంగ్రెస్ సమీక్షా సమావేశం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి మండల/పట్టణ పార్టీ అధ్యక్షుల అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ గ్రామ, వార్డు, బూత్ స్థాయి నాయకులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసినందులకు ధన్యవాదాలు తెలపడంతో పాటు, ఎన్నికల ఫలితాలు - పోలింగ్ బూత్ ల వారిగా సమీక్ష చేసేందుకు ఈ సమావేశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల పై (ఆరు గ్యారంటీలు) చర్చిస్తారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలపై , కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నారు. కాబట్టి ఆయా మండల/పట్టణ పరిధిలోని మండల, పట్టణ, గ్రామ, వార్డు, బూత్ స్థాయి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## పంపిణీకి సిద్ధంగా క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లు

### జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జెర్సన్ కుమార్



**వరంగల్ వాయిస్, ములుగు :** క్రిస్మస్ పండుగ సందర్భంగా నిరుపేద క్రైస్తవులకు పంపిణీ చేసేందుకు 1000 గిఫ్ట్ ప్యాకెట్లు సిద్ధం చేశామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.జెర్సన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి ములుగు నియోజకవర్గనికి 1000గిఫ్ట్ ప్యాకెట్లు, విందు కోసం రూ.2,00,000, నియోజకవర్గంలో 1000గిఫ్ట్ ప్యాకెట్లను నిరుపేద క్రైస్తవులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా మంత్రి సమయం తీసుకుని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్, సీసీఓసీ కమిటీ ద్వారా గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ జరుగుతుందని ఆ ప్రకటనలో ఎన్.జెర్సన్ కుమార్ తెలిపారు.

## 24న ఎస్ఆర్ ఎడ్యుసెంటర్ స్కాలర్ షిప్ టెస్ట్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 24న హనుమకొండ లోని ఎస్ఆర్ ఎడ్యుసెంటర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఆర్ అకాడమిక్ స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ లో చేరే విద్యార్థులకు హనుమకొండ వడ్డేపల్లిలో ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్, నీట్ లలో 50సంవత్సరాల అనుభవం కలిగిన ఎస్ఆర్ ఎడ్యుసెంటర్ నిర్వహిస్తున్న ఈ పరీక్షలో అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులకు 100శాతం స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి సంవత్సరం హైస్కూల్, జూనియర్ కాలేజి, ఎంసెట్, ఐఐటీ, నీట్ లలో విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న తమ విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్ లో స్టేట్ మొదటి ర్యాంకు, జేఈఈ మేయిన్, అడ్వాన్స్, నీట్ లలో ఈ ఏడాది జాతీయ ర్యాంకులు సాధించడం జరిగిందని వరదారెడ్డి తెలిపారు.

## బూత్ స్థాయి ఆఫీసర్లకు సన్మానం



**వరంగల్ వాయిస్, నడికూడ :** జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు నడికూడ మండలంలోని 31మంది బూత్ లెవెల్ ఆఫీసర్లందరికీ సంక్షిప్త సవరణ 01-01-2024 అర్హత తేదీని దృష్టిలో పెట్టుకొని ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. అలాగే వారి స్థాయిలో అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన అందరూ బూత్ లెవెల్ ఆఫీసర్లను శాలువాలతో సత్కరించి వారి సేవలను తహసీల్దార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లావుడియా హేమా నాయక్, సీనియర్ సహాయకులు శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, రాజు, రాణి, ప్రభాకర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఫార్మసిస్టు సమస్యలు పరిష్కరిస్తాం

### నూతన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ బానోత్ రవీంద్ర నాయక్ హామీ




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ (టీజీపీఏ)రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.రవీంద్ర నాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. త్రివేణి, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్.వి.కర్ణన్ లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఫార్మసిస్టులకు ప్రమోషన్ లు ఇవ్వాలని, ఫార్మసీ ఆఫీసర్ గా పేరు మార్చాలని, పని భారం తగ్గించాలని, మిగతా అన్నీ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న అధికారులను కోరారు. అధికారులు వెంటనే స్పందిస్తూ తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ గౌరవ అధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్, స్టేట్ కోశాధికారి యాదయ్య, అడ్వైజర్లు ముతార్, అహ్మద్ ఉల్లా ఖాన్, ఉపాధ్యక్షులు పంద్రాల శంకర్, ఎల్.రామ్ చందర్, కార్యదర్శులు ప్రియదర్శిని, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లాల కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సైక్లింగ్ పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన ములుగు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన డోంగ్రి శ్రీనివాస్, తేజావత్ యాకూబ్, గొట్టిముక్కుల తులసిరామ్, పూతల మనోహర్ లను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. శుక్రవారం నుంచి సిద్దిపేటలో జరగబోయే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో కూడా పాల్గొని చక్కని ప్రతిభను ప్రదర్శించి బహుమతులు గెలుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం క్యాతం రాజేందర్, పిట్టల మల్లయ్య, శిరూప సతీష్ కుమార్, తోట చంద్రమౌళి, గుండేటి మమత, సంగ చేరాలు, శివనాధుని శారద, బైకాని రజిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, ములుగు :** మండల ప్రజా పరిషత్ ఏటూరునాగారం మీటింగ్ హల్ లో గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ అధ్యక్షతన ఐదు మండలాల (మంగపేట, ఏటూరునాగారం, కన్నాయి గూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలు ) పంచాయతీ కార్యదర్శులతో పల్లె ప్రగతి నివేదికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పల్లె ప్రగతిలో భాగంగా నర్సరీలు, సిగ్రీగెషన్ షెడ్డులు, శానిటేషన్, పల్లె ప్రకృతి వనాలు గురించి, గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు చేయవలసిన పనులు గురించి సమావేశంలో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయితీ అధికారి కొండ వెంకయ్య, స్వరూప, డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఏటూరునాగారం మండలం బూస కుమార్, ఐదు మండలాల మండల పంచాయతీ అధికారులు హనుమంత రావు, శ్రీకాంత్, రామకృష్ణ, కుమార్, ఐదు మండలాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పూజ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో గురువారం ఉప్పునూతల ప్రసాద్ గురు స్వామి ఇంట్లో నారికేలి అయ్యప్ప పూజ ఘనంగా జరిగింది. గురు స్వామి సామల భిక్షపతి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజను వేదమంత్రాలు మధ్య గణేష్ కుమారస్వామి లక్ష్మీదేవి అయ్యప్ప స్వామి అష్టోత్తరాలు శరణు ఘోషతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప పూజ అనంతరం మాల ధరించిన స్వాములకు, భక్తులకు మహా అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కందకట్ల రవి, మాజీ సర్పంచ్ వలుపదాసు చంద్రమౌళి, మాజీ ఎంపీటీసి వినుకొండ శంకరాచారి, గురు స్వాములు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, సామల రవీందర్, బొల్లపల్లి సదానందం, మార్త సుమన్, గట్టు కిషన్, బాసాని మల్లికార్జున, కొప్పుల శ్రీధర్ రెడ్డి, గోరంట్ల ప్రశాంత్, ప్రదీప్, ప్రవీణ్, బాలకృష్ణ, వంశీ, వినుకొండ రాజ్ కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓయూలో కాంగ్రెస్ మేనిఫెస్టో దహనం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ వద్ద కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఓయూలో నిరుద్యోగ జేఏసీ గురువారం దహనం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో లో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధీ అవకాశాలు కల్పించే వరకు ప్రతి నెల రూ.4000 నిరుద్యోగ భృతిని చెల్లిస్తామని తెలిపి నిన్న శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో గానీ, మేనిఫెస్టోలో గాని నిరుద్యోగ భృతి గురించి ఎక్కడా చెప్పలేదని నిరుద్యోగులను అవమాన పరచటాన్ని నిరసిస్తూ గురువారం ఉదయం ఓయూలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతులను నిరుద్యోగ నేతలు తగలబెట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ 1.8శాతం నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు వేల నిరుద్యోగ భృతి ఎగ్గొట్టాలని చూస్తే నిరుద్యోగ జేఏసీ కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడుతుందని హెచ్చరించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడెక్కడ ఉన్నాయో శ్వేత పత్రం విడుదల చేసి ఆ ఉద్యోగాల భర్తీకి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పదవుల కోసం కొద్దిమంది ఓయూ నాయకులు కాంగ్రెస్ నేతలకు బానిసలు కావచ్చు గానీ, ఓయూ మాత్రం ఎప్పుడు నిరంతరం ప్రతిపక్షంగానే ఉంటుందని మానవతారాయ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, ప్రియాంక గాంధీకి నిరుద్యోగుల ఉసురు తగిలి కొట్టుకుపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ నేత మేడారపు సుధాకర్ నేత, ఓయూ జేఏసీ నిరుద్యోగ జేఏసీ నేతలు దుర్గం వినోద్, బూసిపాక గణేష్ మాదిగ, పట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చలి చంపేస్తుంది..

### కనిష్ఠానికి పడిపోయిన ఉష్ణోగ్రతలు

**వరంగల్ వాయిస్ ,మల్హర్ :** ఉదయం పది గంటల వరకు మంచు పొరలు, సాయంత్రం ఐదు గంటలకే అలుముకుంటున్న చీకట్లు ,రాత్రి సమయంలో విపరీతమైన చలి . ఇప్పుడు ఇది అటవీ గ్రామాల్లో ఉన్న పరిస్థితి. గత ఐదు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో గ్రామాల్లో చలి విజృంభిస్తోంది. చలికి తూర్పు నుండి వీస్తున్న బలమైన ఈదురు గాలులు తోడవడంతో అటవీ గ్రామాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 11 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో గ్రామాల్లో పిల్లలు వృద్దులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గాలులతో కూడిన చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు రోజులుగా బయటకు రావాలంటేనే జంకుతుకున్నారు. డిసెంబర్ మొదటి వారంలో తుఫాన్ ప్రభావం తో చలి తీవ్రత పెరిగి తూఫాన్ తరువాత తగ్గినప్పటికీ తాజాగా మళ్లీ కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిన చలి తగ్గక పోవడంతో ప్రజలు ఇళ్ళ నుండి బైటికి రావడానికి జంకుతున్నారు. అత్యవసర పనులు ఉన్నవారు ఉదయం 10గంటల తరువాత వెళ్లి సాయంత్రం వరకే ఇళ్లకు చేరుకుంటున్నారు. చలి తీవ్రత వల్ల గ్రామాల్లో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఎదురవుతుంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల్లో జ్వరం, జలుబు బాధితుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. చలి, గాలిలో తేమ కారణంగా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి చాలా మందిలో శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు పట్టేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. చలి పంజా విసురుతున్న క్రమంలో పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, వీలైనంత మేరకు ఉదయం, సాయంత్రం ఆరుబయట తిరుగొద్దని చలి నుండి తట్టుకోవడానికి ఉన్ని దుస్తులు ధరించాలని , రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత



**వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలి**
**వీలైనంత వరకు ఆరుబయట తిరగరాదు**
**కరోనా వ్యాప్తితో వైద్యుల హెచ్చరిక**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ సహా ఇతర ప్రాంతాల్లోనూ చలి విజృంభిస్తోంది. చలి పంజా విసురుతున్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వీల్కైనంత మేర సాయంత్రం, ఉదయం ఆరుబయట తిరగకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు పాటిస్తే ఏం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. జ్వరం, జలుబు, గొంతు సమస్యలు పెరుగుతున్న తరుణంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండడంతో ప్రజల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 కారణంగా కేసులు పెరుగుతున్నాయని, మాస్కులు ధరించి అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం సూచించింది. చలి జ్వరం, జలుబుతో ఇబ్బంది పడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తూర్పు తీరం నుంచి బలమైన గాలుల కారణంగా గత 3, 4రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అటు, ఏపీలోనూ ఏజెన్సీ ప్రాంతాల్లో చలిపంజా విసురుతోంది. వాతావరణ మార్పులతో ఇప్పటికే చాలామంది జలుబు, దగ్గుతో సతమతమవుతుండగా కరోనా హెచ్చరికలు ఇప్పుడూ ప్రజలను మరింత కలవరపెడుతున్నాయి. ఒక్క హైదరాబాద్ లోనే 13కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ఆస్పత్రులు జ్వర పీడితులతో నిండిపోయాయి. అయితే, చాలా ప్రాంతాల్లో ప్రజలు గాలులతో కూడిన చలి కారణంగా బయటకు రావాలంటేనే జంకుతున్నారు. డిసెంబర్ మొదటి వారం నుంచి జలుబు, దగ్గు, జ్వర పీడితులు ఎక్కువయ్యారు. పదేళ్ల లోపు పిల్లలు, 60ఏళ్లు దాటిన వారు, గర్భిణులు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని స్పష్టం చేస్తున్నారు. వీల్కైనన్ని ఎక్కువ సార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరైతే ప్రయాణాలు చేయాలని పేర్కొంటున్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరించాలని, ఇంటి లోపల వేడిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తెలంగాణలో దాదాపు 8 నెలల తర్వాత గత మంగళవారం రాత్రి వైద్యారోగ్య శాఖ మరోసారి కొవిడ్ బులెటిన్ విడుదల చేసింది. ఈ బులెటిన్ ప్రకారం 402 పరీక్షలు నిర్వహించగా, కొత్త కొవిడ్ కేసులు నమోద్కైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ 14 కేసులు యాక్టివ్ గా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనే ఎక్కువగా కేసులు నమోదు కావడంతో పలు గేటెడ్ కమ్యూనిటీల్లో మాస్కులు, శానిట్కైజేషన్లు మళ్లీ ప్రారంభించారు. అలాగే, పలు కార్పొరేట్ సంస్థలు సైతం తమ ఉద్యోగులను కొవిడ్ ప్రోటోకాల్ పాటించేందుకు సిద్ధంగా ఉండాల్సిందిగా అలర్ట్ చేస్తున్నాయి. అటు, నగరంలోని గాంధీ, నల్లకుంట ఫీవర్, చెస్ట్ ఆస్పత్రులతో పాటు మరో 2 ఆస్పత్రుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన పీపీఈ కిట్లు, డిస్పోజబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిట్కైజర్లు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ భాగ్య నగరం నుంచి పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగించేవారు అధిక సంఖ్యలో ఉంటారు. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు ప్రయాణించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఏమాత్రం అనారోగ్య సూచనలున్నా ప్రయాణాలు మానుకోవాలని, వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, రాష్ట్రంలో గత 3, 4 రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.సాధారణం కంటే అన్ని జిల్లాల్లోనూ సగటున ఒకట్రెండు డిగ్రీలు తక్కువగా నమోద్కైనట్లు చెప్పారు. సాయంత్రం నుంచి ఉదయం వరకూ చలి గాలుల కారణంగా చాలామందిలో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తేమ కారణంగా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయి చాలామందిలో శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు సంబంధిత సమస్యలు ఎక్కువయ్యాయి. అటు, పాడి పంటలకు సైతం చలి వాతావరణంతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. పాడి పశువుల్లోనూ పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు.

# విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ



**శ్వేతపత్రం విడుదల చేసిన భట్టి**

**అప్పులు చేసి ఆస్తులు పెంచామన్న జగదీశ్ రెడ్డి**

**గత ప్రభుత్వం తీరుపై మండిపడ్డ అధికార పక్షం**

**ప్లాంటుల పేరుతో దోపిడీ చేశారన్న కోమటిరెడ్డి**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ సాగింది. వాదోపవాదాలు సాగాయి. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై విపక్ష సభ్యులు విమర్శలు సంధించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిపై సభలో లఘు చర్చ ప్రారంభం కాగా, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గత నిర్ణయాలను సమర్థించుకున్నారు. అయితే రాష్ట్రానికి సంబంధించినంతవరకు ఏ రంగం అభివృద్ధి చెందాలన్న విద్యుత్ అవసరమని.. అలాంటి విద్యుత్ ఉత్పత్తి, ధీంట్లో ఇబ్బందులపై రాష్ట్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియాలనే ఆలోచనతో శ్వేత పత్రాన్ని ప్రవేశపెడుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పురోగతి, అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, వ్యవసాయ రంగం పురోగతికి, సేవారంగం అభివృద్ధికి నమ్మకమైన విద్యుత్ సరఫరాయే వెన్నెముకని అన్నారు. వైద్య రంగంలో అత్యవసర సేవలకైనా, రవాణా, సమాచార రంగాల మనుగడకైనా నాణ్యమైన విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజల నాణ్యమైన జీవన శైలిని సూచించేది కూడా విద్యుత్ అని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా చూస్తే ఆర్థిక, నిర్వాహణ పరంగా విద్యుత్ రంగం పరిపుష్టిగా ఉండడం రాష్ట్ర మనుగడకు చాలా అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి జెన్‌కోలో విద్యుత్ సామర్థ్యం 4,365.26 మెగావాట్లుగా ఉందిని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రం ఏర్పాటు కన్నా చాలా ముందు గానే.. ఆనాటి నాయకుల ముందు చూపుతో తెలంగాణలో 2,960 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు అవసరమైన ప్రణాళిక పనులు చేపట్టారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉత్పతి ప్రారంభించిన కొత్త విద్యుత్ కేంద్రాలే తర్వాత కాలంలో తెలంగాణలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం రూపకల్పన సమయంలోనే విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి అదనంగా 18 వందల మెగావాట్ల విద్యుత్ వచ్చే విధంగా యూపీయే ప్రభుత్వం సోనియాగాంధీ నాయత్వంలో ప్రత్యేక నిబంధన చట్టంలో రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఒకే ఒక ప్రాజేక్టు పూర్తి..

తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టి పూర్తి చేసింది కేవలం 1,080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు మాత్రమేనని మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టులో ప్రమాణాలకు విరుద్ధంగా సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించటం వల్ల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందని ఆయన ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వ్యయంలో కేవలం బొగ్గు సరఫరాకు ఏడాదికి రూ. 800 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని, రాష్ట్ర విద్యుత్ రంగ ఆర్థిక పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, డిస్కంలు రూ. 81,516 కోట్ల నష్టాల్లో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు రూ. 28,673 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు రూ. 28,842 కోట్ల బకాయిలను డిస్కంలకు చెల్లించాల్సి ఉందని, రూ. 14,193 కోట్లు సాగునీటి శాఖ బకాయి ఉందన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఇబ్బందులకు ఈ బకాయిలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రూ. 14,928 కోట్ల సర్దుబాటు ఖర్చులు చెల్లించక పోవటం డిస్కంల ఆర్థిక పరిస్థితిని కుంగదీసిందని, దీంతో రోజువారి విద్యుత్ మనుగడకు భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిరదన్నారు. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఉన్నా వాటిని అధిగమించి నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## తెలంగాణలోనే 24గంటల విద్యుత్..

ఈ అంశంపై మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ..దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ తన స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమెట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణలో విద్యుత్ పరిస్థితిని ఆయన వివరించారు. 2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు రూ.44,438 కోట్లు ఉంటే.. అప్పు రూ.22,423 కోట్లు ఉండేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు రూ.81,016 కోట్లు కాగా, ఆస్తుల విలువ రూ.1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని.. ఆస్తులు పెంచామని వివరించారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంలో పిల్లలకు పరీక్షలు వస్తున్నాయంటే.. పెద్దలకే పెద్ద పరీక్ష ఉండేదని గుర్తు చేశారు. పరీక్షలు వస్తున్నాయంటే.. కిరసనాయిల్ దేవులాడుకురావడం.. క్యాండిల్స్ కొనుక్కొచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్లు కావాలంటే బోరుబావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా బోరుబావి దగ్గరికి పోయాక కరెంటు పోతే.. రెండు గంటలా మూడు గంటలా నాలుగు గంటలా ఎన్ని గంటలు అక్కడే ఉండాలో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. బిందెడు నీళ్లు లేకుండా ఇంటికి పోతే ఎసరు పెట్టే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా అని ప్రశ్నించారు. ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు ధర్నా చేసిన మొట్టమొదటి సందర్భం సమైఖ్య పాలనలోనే హైదరాబాద్‌లో జరిగిందని గుర్తు చేశారు.

## వాడి, వేడీ చర్చ..

ఇదే అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది.

ముందుగా యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో రూ.10 వేల కోట్లను జగదీశ్ రెడ్డి తిన్నారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి కోరారు. ఆ విచారణలో దోషులు దొరికితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆదారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు. తప్పకుండా ఈ విషయం తేలాలన్నారు. ఇటువంటివి చాలా సందర్భాల్లో బయట మాట్లాడుతుంటే విన్నానని.. కానీ ఏ ఒక్కరోజు కూడా రియాక్ట్ కాలేదని చెప్పారు. ఇవన్నీ పనికిమాలిన మాటలు.. అర్థం లేని.. ఆధార రహితమైన మాటలు అని కొట్టి పారేశారు. ఇవన్నీ రికార్డుల్లోకి రావాలనే ఇన్ని రోజులు వెయిట్ చేశానని.. ఇవాళ రికార్డుల్లోకి వచ్చాయన్నారు. దీనిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జ్యుడీషియల్ ఎంక్వైరీ..

దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆ విచారణతో పాటు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలన్నారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. అది విరీరు చేయగలుగుతారా? ప్రజా కోర్టులో తేలుస్తామా అనేది చూడాలన్నారు. అయితే వాస్తవ పరిస్థితులను కాదని గతం గురించి మాజీ మంత్రి మాట్లాడడంపై సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం చెప్పారు. తరవాత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ పేరుతో అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిందేనని అన్నారు.








# అంగన్వాడీ సేవలపై అధికారుల సమీక్ష



**వరంగల్ వాయిస్, ములుగు :** మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఈపీ.ప్రేమలత అధ్యక్షతన నేడు జిల్లాలోని గుత్తి కోయా అంగన్వాడీ కేంద్రాల ఇంచార్జి అంగన్వాడి టీచర్లకు ఐటీడీఏ, ఏటూరునాగారంలోని సమావేశపు గదిలో గుత్తి కోయా హబిటేషన్ లో ఉన్న గర్భిణి స్త్రీలు, పిల్లలకు, సమీపంలో ఉన్నా అంగన్వాడీ కేంద్రాల నుంచి అందుతున్న సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ ఏటూరునాగారం అంకిత్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజలు హాజరయ్యారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నివసిస్తున్న గుత్తి కోయలకు సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గుత్తి కోయ గర్భిణి స్త్రీలు, పిల్లలు రక్త హీనతకు లోప పోషణకు గురికుండా ఐసీడీఎస్ ద్వారా అందించే సేవలన్నీ కూడా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నివసిస్తున్న గ్రామస్థులతో పాటు కేంద్రం పరిధిలో ఉన్న గుత్తి కోయ గుంపులను గుర్తించి అర్హులను అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఇప్పటి వరకు నమోదు చేసుకున్న వారికి పోషకాహర పంపిణీ చేయాలని తెలిపారు. వాటిని అందుకున్న వారికి క్రమం తప్పకుండా వినియోగించుకునేలా ప్రోత్సహిస్తూ పౌష్టికాహారం సేవించడం వలన కలిగే ప్రయోజనాలు కూడా తెలియజేయాలని అధికారులకు, అంగన్వాడీ టీచర్లకు సూచించారు. గ్రామాల నుంచి దూరంగా నివసిస్తున్న గుత్తి కోయ గుంపులను కచ్చింతంగా నెలకు ఒకటి లేదా రెండు సార్లు సందర్శించి పోషకాహార ఆవశ్యకతను వారికి తెలిసేలా అంగన్వాడి టీచర్లు చర్యలు చేపట్టడంతో పాటు వారి సంక్షేమం కోసం పాటు పడాలని తెలిపారు. ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ మాట్లాడుతూ గుత్తి కోయ గుంపులో నివసిస్తున్న గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు రక్త హీనతకు, లోప పోషణకు గురైన వారికి ప్రత్యేకంగా సప్లమెంటరి న్యూట్రిషన్ డ్రైవ్ క్రింద స్పెషల్ ఫుడ్ పంపిణీ చేయబడుతాయని తెలిపారు. అందుకు సంబంధించిన నివేదిక వెంటనే సిద్ధం చేయాలనీ జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓలు వి.హేమలత, జి.మల్లేశ్వరి, శిరిష, సూపర్ వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొనారు.



# టైటిల్ ఖరారు కాలేదు

## చిత్ర నిర్మాత అర్చన కల్పతి స్పష్టీకరణ

విజయ్ హీరోగా వెంకట ప్రభు దర్శకత్వంలో 'దళపతి 68' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే! మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభుదేవా, లైలా, స్నేహ ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రం టైటిల్ విషయంలో కొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై చిత్ర నిర్మాత అర్చన కల్పతి స్పందించారు. దళపతి 68'కు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాటిల్లో నిజం లేదు. మీరంతా మా సినిమాపై చూపిస్తోన్న అభిమానానికి థ్యాంక్స్. వెంకట ప్రభు ఓ కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నారు. 'బాస్', 'పజిల్' అనే టైటిల్స్ ఈ సినిమాకు సంబంధించినవి కావు. మా సినిమా టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తాం. అప్పటి వరకూ వెయిట్ చేయండి' అని ట్వీట్ చేశారు ఏజీఎస్ ఎంటర్‌టైన‌మెంట్ అధినేత అర్చన కల్పతి. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ చిత్రంలో విజయ్ డ్యూయల్ రోల్ చేయనున్నారు. హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విదేశాల్లో షూటింగ్ జరుగుతోంది. ఇక ఇందులో విజయ్ వింటేజ్ లుక్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఆ కాలంలో తను ఎలా ఉండేవాడో అచ్చంగా అలాగే కనిపించడానికి 'డీ ఏజ్‌నింగ్ టెక్నాలజీ' వాడుతున్నారని కోలీవుడ్ మీడియా చెబుతోంది.




# ప్రభాస్ సలార్ విడుదల

## డంకీ, సలార్‌ల మధ్య థియేటర్ల గొడవ

చాలాకాలంగా ఎదురు చూస్తున్న సలార్ నేడు విడుదల కాబోతోంది. అయితే ఉత్తరాదిలో డంకీ కారణంగా సలార్‌కు తక్కువ థియేటర్లు దక్కాయి. దీనిపై నిర్మాతలు మండిపడుతున్నారు. నేషనల్ మల్టీప్లెక్స్ చైన్స్ పీవీఆర్, ఐనాక్స్‌కు ప్రభాస్ నటించిన 'సలార్' టీమ్ నుంచి భారీ షాక్ తగిలింది. ఉత్తరాదిలో షారుక్‌ఖాన్ నటించిన 'డంకీ' చిత్రానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో దక్షిణాది విషయంలో ఝలక్ ఇచ్చారు. నార్త్‌లో 'సలార్'కు అన్యాయం చేయాలని చూస్తే సౌత్ ఇండియాలో సినిమాను ఇచ్చేది లేదని ప్రభాస్ దర్శక నిర్మాతలతో పాటు డిస్ట్రిబ్యూటర్లు కొట్టినట్లు చెప్పడంతో పీవీఆర్, ఐనాక్స్ యాజమాన్యానికి గట్టి షాక్ తగిలింది, అసలు విషయంలోకి వెళ్తే..ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వహించిన 'సలార్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. షారుక్‌ఖాన్ నటించిన డంకీ దాని కంటే ఒక్క రోజు ముందు గురువారం విడుదలైంది. నార్త్ ఇండియాలో ఆ సినిమాకు పీవీఆర్, ఐనాక్స్ మల్టీప్లెక్స్ సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. అధిక సంఖ్యలో థియేటర్లు ఏర్పాటు చేశాయి. ప్రభాస్ కంటే షారుక్‌ఖాన్ కు ఎక్కువ స్క్రీన్స్ ఇవ్వడానికి ప్లాన్ చేశారు. దాంతో ప్రభాస్ నిర్మాతలు వాళ్లకు షాక్ ఇచ్చేలా ఓ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ, తెలంగాణల్లో 'సలార్' బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. అయితే... బుక్ మై షో, పేటీఎం వంటి టికెట్ బుకింగ్ యాప్స్ ఓపెన్ చేసి చూస్తే! పీవీఆర్, ఐనాక్స్ మల్టీప్లెక్స్‌లో బుకింగ్ ఓపెన్ కాలేదు. ఎందుకంటే... ఉత్తరాది రాష్ట్రాల్లో తమ సినిమాకు తక్కువ ఇస్తామని చెప్పినందుకు, దక్షిణాది రాష్ట్రాల్లో కూడా వాళ్ళకు సినిమా ఇవ్వడం మానేశారు. పీవీఆర్, ఐనాక్స్ యాజమాన్యానికి వాళ్ళ స్క్రీన్స్ లో సినిమా విడుదల చేయమని చెప్పేశారు. ఉత్తరాదిలో ప్రభాస్ కంటే షారుఖ్ ఖాన్, దర్శకుడు రాజ్ కుమార్ హిరాణీకి అభిమానులు ఎక్కువ. నార్త్ ఇండియాలో వాళ్ళ ఫ్యాన్ ఫాలోయింగ్ చూసి అక్కడ ప్రయారిటీ ఇవ్వాలని భావించిన పీవీఆర్, ఐనాక్స్ యాజమాన్యం సౌత్ ఇండియాలో పెద్ద మార్కెట్ మిస్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సలార్‌లో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఉన్నారు. కేరళలో 'బాహుబలి 2' రికార్డులను ఈ సినిమా బ్రేక్ చేసే అవకాశాలున్నాయని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. 'కెజియఫ్'తో ఇండియాలో స్టార్ దర్శకుడిగా ప్రశాంత్ నీల్ గుర్తింపు తెచ్చుకున్నారు. కన్నడలో ఆయన నంబర్ వన్ దర్శకుడు. తెలుగులో ప్రభాస్ మార్కెట్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.. దక్షిణాదిలో 'సలార్'కు పోటీ లేదు. ఆ సినిమా ఏ థియేటర్లలో ఉంటే ఆ థియేటర్లకు ప్రేక్షకులు వెళ్తారు. దీంతో పీవీఆర్, ఐనాక్స్, మిరాజ్ మల్టీప్లెక్స్ చైన్‌కు లాసు తప్పదు. ఇదంతా తెలుసుకున్న నెటిజన్లు, అభిమానులు డంకీ చిత్రం గురించి ట్రోలింగ్ మొదలుపెట్టారు. అక్కడ షార్‌క్ అయితే... ఇక్కడ ప్రభాస్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.








# విదేశాలకు వెళ్లాలన్న యువకుల కథ ..

రెండు వరస హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు మూడో సినిమా 'డంకీ'తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దీనికి రాజ్ కుమార్ హిరాణి దర్శకుడు, అతను ఇంతకు ముందు 'మున్నాభాయ్', 'లగే రహే మున్నాభాయ్', '3 ఇడియట్స్', 'పీకే', 'సంజు' లాంటి చాలా గొప్ప గొప్ప సినిమాలు చేశారు. ఇప్పుడు ఈ 'డంకీ' సినిమా కి దర్శకత్వం చేశారు. పంజాబ్ లోని ఒక ఊరులో నలుగురు స్నేహితులు ఇంగ్లాండ్ వెళ్లాలని కలలు కంటారు. మను (తాప్సి), సుఖీ సింగ్ (విక్కీ కౌశల్), బగ్గు (విక్రమ్ కొచ్చర్), బల్లి (అనిల్ గ్రోవర్) నలుగురూ ఇంగ్లాండ్ వెళ్లాలని అనుకుంటారు, కానీ వాళ్ళ దగ్గర వీసాలు లేవు, టికెట్స్ కొనడానికి డబ్బులు కూడా లేవు ఇంగ్లీష్ రాదు. ఆ సమయంలో హార్డీ సింగ్ (షారుఖ్ ఖాన్) అనే ఒక సైనికుడు తన ప్రాణాలు కాపాడిన వ్యక్తిని వెతుకుతూ ఆ గ్రామం వస్తాడు, ఆ వ్యక్తి మనుకి అన్న అని తెలుసుకొని, ఇక ఈ నలుగురినీ ఇంగ్లాండ్ పంపించే బాధ్యత తన మీద వేసుకుంటాడు. అదే ఊరులో ఇంగ్లీష్ నేర్పే వ్యక్తి బొమ్మన్ ఇరానీ దగ్గర అందరూ క్లాసుకు వెళతారు. కానీ వీళ్ళకి సరిగా ఇంగ్లీష్ రాకపోవటంతో ఇంగ్లాండ్ కి వెళ్ళడానికి వీసాలు రావు. అప్పుడు హార్డీ సింగ్ ఏమి చేసాడు, ఎలా వీళ్ళని ఇంగ్లాండ్ తీసుకెళ్లాడు, అక్కడ వీళ్ళకి ఎటువంటి సంఘటనలు ఎదురయ్యాయి, చివరికి అందరూ మళ్ళీ ఎటువంటి నిర్ణయం తీసుకున్నారన్నదే 'డంకి' సినిమా కథ. దర్శకుడు రాజ్ కుమార్ హిరాణి తనదైన శైలిలో వినోదాత్మకం తో కూడిన భావోద్వేగాలు బాగా చూపిస్తారు. బాలీవుడ్ లో దర్శకుడిగా అతను చేసినవి ఈ 'డంకి'తో కేవలం ఆరు సినిమాలే అయినా వాటి తాలూకా ప్రభావం చాలా పెద్దగా ఉంటుంది. ఇప్పుడు ఈ 'డంకి' లో 95 దశకంలో పంజాబ్ కి చెందిన ఒక వూరు నుండి నలుగురు కుర్రాళ్ళు డబ్బు సంపాదించి, తమ జీవితాలు బాగుపడాలని అందుకోసం లండన్ వెళ్లాలని కలలు కంటారు. కానీ దానికి వీసా కావాలి, ఇంగ్లీష్ తెలియాలి, కొన్ని పరీక్షలు రాయాలి ఇలా చాలా దాటుకుంటూ వెళ్ళాలి. కానీ ఇంగ్లీష్ రాని, డబ్బులు లేని ఈ నలుగురు దొంగదారిని లండన్ వెళ్ళడానికి నిశ్చయం చేసుకుంటారు. దానికి ఒక మాజీ సైనికుడు హార్డీ సింగ్ సహాయం చేస్తాడు. అయితే ఇక్కడ ఆ నలుగురూ వీసా కోసం పడే బాధలు, కష్టాలు అన్నీ వినోదాత్మకంగా చూపించారు దర్శకుడు రాజ్ కుమార్.  మాతృ దేశం, దేశభక్తి ఇవన్నీ అంతర్లీనంగా తనదైన శైలిలో చూపించిన రాజ్ కుమార్ ఈ 'డంకి' సినిమా ద్వారా ఇప్పుడు విదేశాలకి ఇబ్బడిముబ్బడిగా ఎగబడుతున్న యువతకి ఒక సందేశంలా ఈ సినిమా ఉపయోగపడుతుంది.రెండో సగంలోనే కొంచెం సాగదీత ఉంటుంది, కానీ అక్కడక్కడా మళ్ళీ భావోద్వేగ సన్నివేశాలతో, దేశభక్తిని మిళితం చేస్తూ చూపించారు. 'డంకి' సినిమా దేశభక్తిని చాటిచెపుతోంది, అలాగే మాతృదేశంలో తనవారందిరితో జీవిచటంలో వున్న సంతోషం, విదేశాలకు కేవలం డబ్బుకోసం వెళ్లడంలో వున్న ఆనందంతో పోలిస్తే అక్కడ ఏమీ ఉండదు అని పరోక్షంగా ఈ సినిమాతో చెప్పారు దర్శకుడు రాజ్ కుమార్.

# ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయం

**మేయర్ గుండు సుధారాణి**

**కేక్ కట్ చేసిన మేయర్, కమిషనర్**

**జేఏసీ ఆధ్వర్యంలో ప్రీ-క్రిస్మస్ వేడుకలు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని బల్దియా మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రి-క్రిస్మస్ వేడుకలో భాగంగా బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) అధ్వర్యంలో మునిసిపల్ ఎంప్లాయిస్ క్రిస్మస్ వేడుకలు-2023 బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాలు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా వారం పాటు జరుగుతాయని, సుదీర్ఘ కాలంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో జేఏసీ ప్రతినిధులు వేడుకలు నిర్వహించడం ముదావహం అన్నారు. సర్వమత సమానత్వం పాటిస్తూ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం అన్నారు. దసరా, రంజాన్, క్రిస్మస్ పర్వదినాల సందర్భంగా అవసరార్డులకు వస్త్రాలను, బహుమతులను అందజేయడం గొప్ప విషయమని, సర్వ మత సంక్షేమమే మన అభిమతం కావాలని ఈ సందర్భంగా మేయర్ తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ దయా, క్షమా గుణం కలిగి ఉండాలని ఏసు ప్రభువు సందేశించారని, సిబ్బంది కుటుంబ సభ్యులతో సంతోషంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రీస్తు జననానికి గుర్తుగా ఇళ్ళ పైన ఏర్పాటు చేసే స్టార్ లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవన్నారు. దసరా, దీపావళి, రంజాన్, వినాయక చవితి పండగల క్రమంలో బల్దియా నుంచి సేవలు అందించడం జరుగుతుందని, అదే విధంగా అన్ని పండుగలను సమష్టిగా ఐక్యమత్యంగా జరుపుకోవాలని అన్నారు. జేఏసీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కానుకలను(వస్త్రాలను) మేయర్, కమిషనర్ లు నాల్గవ తరగతి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ లు సంయుక్తంగా కేక్ కోసి, ఒకరి కొకరు అందజేసుకొని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పాటు ఉద్యోగులు, సిబ్బందికి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు, ఉద్యోగులు సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ దైవ సందేశకులు రెవరెండ్ డాక్టర్ డి.ఐజాక్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ లు అనిసుర్ రషీద్, సీపీ వెంకన్న, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఉప కమిషనర్ కృష్ణ రెడ్డి, జేఏసీ అధ్యక్షులు గౌరీ శంకర్, కార్యవర్గ సభ్యులు రాజరపు భాస్కర్, సర్జన్ రాజు, బొట్ల రమేష్, గోల్కొండ శ్రీను సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# చెత్త సేకరణలో చిత్తశుద్ధి చూపాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**పారిశుధ్య, మలేరియా అధికారులతో సమన్వయ సమావేశం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి విధిగా చెత్త సేకరణ జరగాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో శానిటేషన్, మలేరియా విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మేయర్ పాల్గొని చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలు నిత్యం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు. రోడ్డు మీద ఎక్కడ చెత్త కనిపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛ్ ఆటోల లాగ్ బుక్ విధిగా నిర్వహించేలా చూడాలన్నారు. మురుగు కాలువల్లో డీ సిల్ట్ ఎప్పటికపుడు తొలగించాలని ఆదేశించారు. దోమలు, వాటి లార్వాలను నియంత్రించడానికి ప్రణాళిక బద్ధంగా ఆయిల్ బాల్స్ వేయాలని ఈ సందర్భంగా మేయర్ సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, బయలజిస్ట్ మాధవ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లు సాంబయ్య, భాస్కర్, నరేందర్ శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com